క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

రామడుగు: రామడుగు, గుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సోమవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఉప వైద్యాధికారి రాజగోపాల్‌రావు తనిఖీలు చేశారు. అటెండెన్స్, అవుట్ పేషెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. సిజేరియన్ వల్ల కలిగే సమస్యలను గర్భిణులకు వివరించారు. సాధారణ డెలివరీల కోసం పీహెచ్‌సీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గ్రీష్మాన్య, డీసీవో ఎన్‌వీహెచ్‌ఎం స్వామి, మలేరియా సబ్ యూనిట్ అధికారి రామనాథం వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధం కావాలి

మాజీ ఎంపీ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

రామడుగు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎంపీ బి. వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని వెదిర బస్టాండ్ వద్ద సోమవారం మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట్ల వెంకట్ రెడ్డి, నాయకులు వంచ మహేందర్‌రెడ్డి, జవ్వాజీ శేఖర్, చాడ శేఖర్‌రెడ్డి, కరుణాకర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఆలయ అధికారులు



జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని శ్రీ దుబ్బమల్లికార్జునస్వామి ఆలయం ఆవరణలో ఆలయ అధికారులు,పూజారులు సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో పచ్చదనం, స్వచ్ఛదనం కోసం 400 మొక్కలు నాటారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఈవో సుభద్ర, ఆలయ ప్రధాన పూజారి వెంకన్న, ఓగ్గు పూజారులు ఎలోగల ఐలయ్య, గుండె రాజయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైకిళ్లు పంపిణీ


జమ్మికుంటరూరల్: మండలంలోని మడిపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రామిడి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎం మోదీ కానుకగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం పురస్కరించుకొని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) నిధులతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇరవై వేల సైకిళ్లు విద్యార్థులకు అందించేందుకు శ్రీకారం చుట్టామని, అందులో భాగంగా మడిపల్లి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తొమ్మిది మందికి సైకిళ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంపత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు

చొప్పదండి: పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా - సబ్బండ వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండ కార్యక్రమంలో భాగంగా మండలంలోని భూపాలపట్నంలో గ్రామ ఇంచార్జి పెరుమాండ్ల గంగయ్యగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి ప్రజాప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేయడంతో పాటు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యం దిశగా పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గుర్రం నీరజ, మునిగాల చందు, మునిగాల సుధాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, ముద్దసాని రంగన్న, ముద్దం తిరుపతి, కొట్టె అశోక్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో గంజాయి 'మత్తు'

- గుట్టుగా సరఫరా అవుతున్న వైనం
- పగలు, రాత్రి తేడా లేకుండా సేవిస్తున్న యువత
- కొన్ని ప్రాంతాలను అడ్డాలుగా ఎంచుకున్న వైనం
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఫలితం శూన్యం



వీణవంక: ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన గంజాయి.. ఇప్పుడు పల్లెల్లోకి పాకింది. పగలు, రాత్రి తేడా లేకుండా యువత గంజాయి సేవిస్తు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. కాలక్షేపం కోసం మొదలుపెట్టి వ్యసనపరులుగా మారుతున్నారు. వీరిలో 12 ఏళ్ల నుంచి 30ఏళ్ల లోపు వారే ఎక్కువ. ఇటీవల ఓ వ్యక్తి మృతి చెందగా గంజాయితోనే అని ఆరోపణలు. ఇటీవల విధుల్లో చేరిన ఎస్సై ఆవుల తిరుపతి క్షేత్రస్థాయిలో గంజాయి సేవించే, విక్రయించే వారిపై నిఘా పెంచినా తీరు మారడం లేదు. రెండు రోజుల క్రితం డాగ్ స్క్వాడ్‌తో మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించి మత్తుపదార్థాలు- అనర్థాలపై అవగాహన కల్పించారు. మండలంలోని 26 జీపీల్లో 52 వేల జనాభా ఉంది.

రైతువేదికలు, గుట్టలు అడ్డా

గంజాయి సేవించేవారిలో పాఠశాల విద్యార్థులే ఎక్కువగా ఉన్నారని, చల్లూరులోని రైతువేదిక, శ్మశానవాటిక, గుట్ట ప్రాంతాల్లో జోరుగా గంజాయి సేవిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా ఊరికి ఆనుకొని ఉన్న మల్లారికుంట ఏరియాలో రాత్రి ఏడు దాటితే యువత అదే పనిలో ఉంటున్నారని, చల్లూరు నుంచి బొంతుపల్లికి వెళ్లేదారిలో గుట్టవద్ద, వీణవంకలోని రైతువేదిక, ఘన్ముక్కుల లోని మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న శ్మశాన వాటిక, కోర్కల్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతువేదికలు గంజాయి బ్యాచ్‌కు అడ్డాలుగా మారాయి. ఓ గ్రామంలోని టీకొట్టు వద్ద సిగరేట్ ద్వారా గంజాయి తీసుకుంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఓ గ్రామానికి చెందిన యువకుడు, యువతి గంజాయి సేవించి వెళ్తుండగా బైక్ పైనుంచి పడటంతో గాయాలపాలయ్యారు. ఓ ప్రభుత్వ స్కూల్ ఏరియాలో రోడ్డు మీదనే గంజాయి మత్తులో యువకులు గొడవకు దిగినట్లు సమాచారం. గతంలో ఎస్సై శేఖర్‌రెడ్డి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు వాటి పర్యవేక్షణను గాలికొదిలేశారు. ఇప్పుడు కొత్తగా విధుల్లో చేరిన ఎస్సై ఆవుల తిరుపతి సమస్యాత్మక కేంద్రాల్లో దాతల సహాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నారు. వీటితో డ్రగ్స్ సేవించేవారిని త్వరగా గుర్తు పట్టే అవకాశం ఉంది. సమస్యాత్మక ఏరియాలపై పోలీసులు నిఘా పెంచినా గంజాయి దందా మాత్రం ఆగడం లేదు. ఒక్క పోలీసుల మీదనే భారం వేయకుండా అన్నిశాఖల అధికారులు గంజాయిని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ ప్రజల గోడు పట్టించుకోలేదు

- ప్రగల్భాలతోనే పదేళ్ల పాలన
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల గోడు పట్టించుకోకుండా ప్రగల్భాలు, ఆర్భాటాలతో పాలన కొనసాగించిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఏడో డివిజన్‌కు(సదాశివపల్లి) చెందిన 12 మందికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ సోమవారం అందజేశారు. పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లను డబ్బా ఇళ్లంటూ ఎగతాళి చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు మూడు నెలల్లో ఇళ్లు కట్టుకోవాలని, దశలవారీగా బిల్లుల చెల్లింపులు జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, ఏడో డివిజన్ అధ్యక్షుడు బండి మల్లేశం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, రామిడి తిరుపతి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, మాతంగి సహదేవ్, సాయిరి దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా రాజాపూర్-కాచాపూర్ రోడ్డు

గుంతల రోడ్డుతో నిలిచిన బస్సు సర్వీసు

శంకరపట్నం: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రాజాపూర్- కాచాపూర్ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. కన్నాపూర్- రాజాపూర్ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో కరీంనగర్ డిపోకు చెందిన రెండు బస్సులను నిలిపివేశారు. బస్సులు రాకపోవడంతో విద్యార్థులు స్కూల్, కాలేజీలకు వెళ్లడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఎమ్మెల్యే స్పందించి గుంతలను పూడ్చివేయించాలని, బస్సు సర్వీసు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గుంతలు పూడ్చిన నాయకులు



మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్ది గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామం నుంచి లక్ష్మీపూర్ మార్గంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మట్టి, మొరం పోసి చదును చేశారు. గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ నాయకులను అభినందించారు.

క్రైం వార్తలు

తాళం వేసిన ఇంట్లో చోరీ

గన్నేరువరం: మండలంలోని చీమలకుంటపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మహమ్మద్ అమీనా బేగం ఇంటికి తాళం వేసి బెజ్జంకి మండలం వడ్లూరులోని బంధువుల ఇంటికి వెళ్లింది. భర్త ఎండీ రహీం ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నాడు. సోమవారం అమీనా ఇంటికి రాగా ఇంటి తలుపు తాళం పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారం, వెండి ఆభరణాలు దొంగిలించారని బాధితురాలి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ పాఠశాల తలుపులు ధ్వంసం

గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పాఠశాల ఎనిమిది గదులకు సంబంధించిన తలుపులను పగల గొట్టేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో తలుపులు ధ్వంసం చేశారు. సోమవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు విషయాన్ని మండల విద్యాధికారి రామయ్యకు తెలిపారు. విద్యాబుద్ధులకు నిలయమైన ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ లేకపోవడం బాధాకరమని, ప్రహరీ తక్కువగా ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి వస్తున్నారని, ప్రహరీ ఎత్తు పెంచడానికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరయ్యాయని, గోడ బాగానే ఉందని పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించడంతోనే ఘటన జరిగిందని ఎంఈవో తెలిపారు. గోడ ఎత్తుగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులకు బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఆయన సతీమణి శాలిని రెడ్డిపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారని పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ కరుణాకర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అవగాహనతోనే కాలేయ వ్యాధులు దూరం



మాట్లాడుతున్న డాక్టర్ దిలీప్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: అవగాహనతోనే కాలేయ వ్యాధులు దూరమవుతాయని మెడికవర్ సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్ దిలీప్ రెడ్డి అన్నారు. ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా సోమవారం వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో హెపటైటిస్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మన శరీరంలో 500కి పైగా కీలక విధులను నిర్వహించే కాలేయాన్ని లక్ష్యంగా చేసుకుని హెపటైటిస్ వైరస్‌లు దాడి చేస్తాయని అన్నారు. వీటి ప్రభావం తక్కువ స్థాయి నుంచి ప్రాణాంతక స్థాయికి వరకు ఉంటుందని తెలిపారు. రక్త మార్పిడి, లైంగిక సంపర్కం ద్వారా వ్యాపిస్తాయని అన్నారు. హెపటైటిస్‌కు టీకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతిఒక్కరూ టీకాలపై అవగాహన కలిగి వేయించుకోవాలని తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాగేశ్వరి కళాశాల చైర్మన్ బీవీఆర్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ సతీశ్‌గౌడ్, వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ రమణ, చైతన్య, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్, కేజీబీవీల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ మోడల్ స్కూల్ ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్ సోమవారం ప్రకటనలో తెలి పారు. ఆరో తరగతిలో 51, ఇంటర్ బైపీసీలో 17, సీఈసీలో 13, ఎంఈసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, పాఠశాల పనివేళల్లో ఆధార్, స్టడీ, తదితర ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లి కేజీబీవీ ఆరో తరగతిలో 20, ఇంటర్ సీఈసీ గ్రూప్‌లో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని, భర్తీకి 30న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎలిగేటి లావణ్య సోమవారం తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం కేజీబీవీ ఆరో తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని స్పెషల్ ఆఫీసర్ మాధవి తెలిపారు. 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మిల్క్ పార్లర్ ప్రారంభం



పార్లర్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై, ప్రభాకర్‌రావు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి క్రాస్‌రోడ్డులో నాగార్జున మిల్క్ పార్లర్‌ను డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లూరి ప్రభాకర్‌రావు, ఎస్సై సాయికృష్ణ సోమవారం ప్రారంభించారు. దాదాపు ఇరవై ఏళ్ల కిందట డెయిరీని ప్రారంభించామని అప్పటి నుంచి నాణ్యతలో రాజీపడకుండా వినియోగదారులకు పాలు, పాల ఉత్పత్తులు అందజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జోనల్ సేల్స్ మేనేజర్ వి.శివకుమార్, అజయ్, విజయ్, వెంకటేశ్, రాకేశ్, రంజిత్ పలువురు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న విష్ణు, నాయకులు

జమ్మికుంట: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో మాట్లాడారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ గురుకులాలను ఎత్తి వేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి లేక పర్యవేక్షణ కరువైందని, ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు చనిపోతున్నారని, అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ జరుగుతుందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అభిలాష్, నవీన్, కుమార్, రాజు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తిమ్మాపూర్: మండలంలోని గ్రామాల్లో సోమవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. మన్నెంపల్లిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దరిపల్లి అజయ్ కుటుంబాన్ని, మల్లాపూర్ గ్రామానికి చెందిన చెన్నాడి నర్సింహారెడ్డి తండ్రి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించారు. నుస్తులాపూర్‌లో కారు ప్రమాదంలో గాయపడిన మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి కుమారుడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, మాజీ సర్పంచ్ మామిడి సతీశ్, మాజీ ఎంపీటీసీ పుప్పాల కనకయ్య, మాజీ ఉప సర్పంచ్ బేతి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, బుదిగె పర్శరాములు, బోయిని తిరుపతి, నాంపల్లి శంకర్, గుంటి రామచంద్రం, దరిపల్లి వేణుకుమార్, నందకిశోర్, దుంబాల సత్తయ్య, చిర్ర సంపత్, కోలకాని సాగర్, దరిపల్లి రమేశ్, గాలిపెల్లి రాజయ్య ఉన్నారు.



ఇల్లందకుంట: మండలంలోని మల్యాల, ఇల్లందకుంట గ్రామాల మధ్య చింతల చెరువు సమీపంలో మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. సంబంధిత అధికారులు ఎలాంటి సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. హనుమకొండ, పరకాల తదితర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డు పైనుంచి వెళ్తుంటాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా హెచ్చరిక, సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్, హుజూరాబాద్ డివిజన్ అధికారి, సెల్ నం.94408 18419

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో గుండవేని తిరుమల ప్రథమ, స్వర్ణం తేజస్విని ద్వితీయ, మిడిదొడ్డి శ్రీవల్లి తృతీయ స్థానంలో, జూనియర్స్ విభాగంలో జింగోని పూజిత ప్రథమ, తిప్పారపు ద్రాక్ష తాయి ద్వితీయ, సాయితేజ తృతీయ స్థానాల్లో నిలిచారు. గెలుపొందిన విజేతలకు ఎంఈవో భూపతి శ్రీనివాస్ మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అంజలి, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ప్లేట్లు, గ్లాసులు వితరణ



విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న కొండయ్య

చిగురుమామిడి: చిగురుమామిడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి మురికి కొండయ్య రూ.15 వేలు విలువ చేసే ప్లేట్లు, గ్లాసులు, వాటర్ ట్యాంకు వితరణ చేశారు. సోమవారం హెచ్ఎం రబియాబిస్రి ఆధ్వర్యంలో అందించారు. కొండయ్య 1962లో ఇదే పాఠశాలలో చదివి వ్యాపారం రీత్యా జమ్మికుంటలో స్థిరపడ్డాడు. కొండయ్యను ఉపాధ్యాయులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి, రావికంటి హరీశ్, సరోజన, స్వాతి, సీఆర్‌పీ, టీచర్లు పాల్గొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావును సోమవారం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఇండియా (లియాఫీ) హుజూరాబాద్ బ్రాంచ్ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కమిటీ అధ్యక్షుడు మొకిరాల సంపత్‌రావు, ఉపాధ్యక్షుడు మునిగాల సమ్మారావు, కోశాధికారి గంట సంపత్, కార్యవర్గ సభ్యులను శాలువాలతో రాజేశ్వర్‌రావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంతప్, లియాఫీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన



తిమ్మాపూర్: మహిళలపై జరుగుతున్న నేరాలు, మానవ అక్రమ రవాణా, అవయవాల విక్రయం, మహిళలను లైంగికంగా వేధింపులకు గురి చేయడం, చిన్న పిల్లలను పనుల్లో పెట్టుకోవడం తదితర నేర అంశాలపై మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు ఎస్ఐ సురేందర్ సోమవారం అవగాహన కల్పించారు. ఆపద సమయంలో 1098, 100, 112 నంబర్లకు కాల్ చేయాలని, పోలీసులు వెంటనే స్పందిస్తారని తెలిపారు.

పదోన్నతి పొందిన డాక్టర్ రాజమోహన్‌కు..



డాక్టర్ రాజమోహన్‌ను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ప్రముఖ న్యూరో స్పెషలిస్ట్ డాక్టర్ బొరగాల రాజమోహన్ మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో న్యూరో సర్జన్ విభాగ అధిపతిగా పదోన్నతి పొందారు. సోమవారం ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు రాజమోహన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రుద్రారపు రామచంద్రం, తడికమళ్ల శేఖర్, బొరగాల సారయ్య, ఎర్ర రవీందర్, రాజ్‌కుమార్, మొగిలి, శ్రీధర్, పుట్టపోగుల ప్రసాద్, తదితరులున్నారు.

ఆర్థికసాయం చేయండి

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన యువకుడు పిన్‌రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి లివర్ వ్యాధితో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి దాతలు ఆర్థిక సాయం చేయాలని బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధి సోషల్ మీడియాలో వేడుకున్నాడు. రాజాపూర్ మాజీ సర్పంచ్ పిన్‌రెడ్డి వసంత-నర్సింహారెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి హెపటైటిస్ -సీ వ్యాధి బారినపడటంతో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు రూ.పదిలక్షలు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పడంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, దాతలు సాయం అందించి ప్రాణం కాపాడాలని కోరాడు.

కార్మికుడికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామ శివారులో సోమవారం గ్రానైట్ క్వారీలో ప్రమాదం జరిగింది. క్వారీ పనుల్లో బిహార్‌కు చెందిన కార్మికుడి చేతికి గాయం కావడంతో వెంటనే క్వారీ యాజమాన్యం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై యాజమాన్యం, కార్మికులు వేర్వేరుగా సమాధానం చెప్పడం అనుమానలకు తావిస్తోంది.